క్లుప్తంగా

అమ్మవారికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనక మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఆదివారం అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్నామని అర్చకులు తెలిపారు. పట్టణంతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం


నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని గవిడివీధికి చెందిన మీసాల అప్పన్న వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు స్థానిక బాపూజీ వృద్ధాశ్రమానికి రూ.5 వేల విరాళం ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకులు కోట్ల లక్ష్మణరావుకు అప్పన్న కుటుంబ సభ్యులు జగన్నాథమ్మ, గోవిందరావు,శ్రీనివాసరావు,చిన్నమ్మ కలిసి వార్డు మెంబర్ మజ్జి శంకరరావు చేతులు మీదుగా ఆదివారం నగదు అందజేశారు.

నేడు వేపాడలో నేత్రవైద్యశిబిరం

వేపాడ: స్థానిక పాలకేంద్రంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శంకర్‌ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ జోగరావు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరంలో సేవలు అందిస్తామని, కంటి సమస్యలు ఉన్న వారు సద్వినియోగించుకోవాలని సూచించారు. పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

నేటి నుంచి ధాన్యం సేకరణ

దత్తిరాజేరు: సాంకేతిక సమస్యలతో కొద్ది రోజుల క్రితం నిలిచిపోయిన ధాన్యం సేకరణ ప్రక్రియను సోమవారం నుంచి మళ్లీ చేపట్టనున్నట్లు ఏఓ అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 55 శాతం ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి మిల్లులకు అప్పగించామని, కొనుగోలు చేసిన ప్రతి ధాన్యం గింజకూ రైతులు ఖాతాల్లో నగదు జమ చేయించామని పేర్కొన్నారు. ఇంకా రైతుల వద్ద మిగిలిన ధాన్యం మొత్తాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని తెలిపారు.

1న గృహసారథుల సమావేశం

దత్తిరాజేరు: మండల కేంద్రంలో ఫిబ్రవరి1వ తేదీన వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అతిథిగా హాజరై, పార్టీ మరింత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

కేంద్ర బృందం పర్యటన నేడు

వేపాడ: ఉపాధి హామీ పథకం నిధులుతో చేపట్టిన పనులు, పలు ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించేందుకు మండలంలో కేంద్ర బృందం సోమవారం పర్యటించనుందని ఎంపీడీఓ పట్నాయక్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు బానాది, మధ్యాహ్నం 2 గంటలకు ఆతవ గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందని, మండల అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు.

3వ తేదీన ఉపసర్పంచ్ ఎన్నికలు

మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లి, శ్యామాయవలస పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నికలను ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీడీఓ పి.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో పలుమార్లు ఎన్నికలు వాయిదా పడ్డాయని పేర్కొన్నారు. 3న నిర్వహించనున్న ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా గృహనిర్మాణశాఖ ఏఈ ఎం.వి.రమణ పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ హరికృష్ణను జిల్లాపంచాయతీ అధికారి నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు సహకరించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షత న నిర్వహించనున్న ఈసమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

తాగునీటి అవస్థలకు చెక్


సాలిపేటలో ఏర్పాటు చేసిన ఇంటింట కుళాయిలు



- జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్
- గజపతినగరం సబ్‌డివిజన్‌కు రెండు విడతల్లో రూ.116.85 కోట్లు మంజూరు
- శరవేగంగా చేపడుతున్న పనులు

గజపతినగరం: గ్రామీణ ప్రాంత ప్రజల తాగునీటి ఇబ్బందులకు శాశ్వతంగా చెక్ చెప్పడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఇందు కోసం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి సురక్షిత తాగు నీటిని సమృద్ధిగా అందించేందుకు పల్లెల్లో పనులు చేపడుతు న్నారు. ఈ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు మంజూరు చేస్తున్నా యి. గజపతినగరం ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పరిధిలోని గజపతి నగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ, గంట్యాడ మండలాల్లో మొదటి, రెండో విడతలో పలుగ్రామాలను అధికారులు జలజీవన్ మిషన్ పనులకు ఎంపిక చేశారు. మొదటి విడత పనులకు రూ.15.15 కోట్లు, రెండో విడతలో రూ.101.70 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రెండు విడతల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రూ.116.85 కోట్లతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులను అధికారులు దాదాపు పూర్తి చేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల తాగునీటి సరఫరా ప్రారంభించగా, కొన్ని గ్రామాల్లో ఇంకా చిన్నచిన్న పనులను పూర్తి చేసి ప్రారంభిం చాల్సి ఉంది. తాగునీటి సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ వందల కోట్ల రూపాయలు వెచ్చించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తుండడంపై గ్రామీణ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలిగాయి



తాగునీటి కోసం గతంలో సుదూర ప్రాంతాల్లోని బోర్ల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీటి ఇబ్బందులు తొలిగాయి. కుళాయిల ద్వారా సరిపడా తాగు నీరు సరఫరా చేస్తున్నారు.

– తాలాడ సూర్యకాంతం, బంగారమ్మ పేట

రెండు విడతల్లో పనులు

గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలో జలజీవన్ మిషన్ పథకానికి రెండు విడతల్లో పలుగ్రామాలను ఎంపిక చేశాం. ఆయా గ్రామాల్లో దాదాపు పనులు పూర్తయ్యాయి. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి సురక్షిత తాగునీరును సమృద్ధిగా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– నానిబాబు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ.

బాలికల సంరక్షణే సఖి గ్రూపుల లక్ష్యం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: బాలికల సంరక్షణే లక్ష్యంగా సఖి గ్రూపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఏ.వేదవతి తెలిపారు. మండల కేంద్రం లోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సఖి గ్రూపుల ఆవశ్యకతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం, రక్తహీనత, ఇతర సమస్యలపై సలహాలు, సహాయం అందించేందుకు ఈ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రూపుల్లో ఉపాధ్యాయినులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ఉంటారని తెలిపారు. సభ్యులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకుని కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో ఇంటింట కుళాయిలు


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు

గుర్ల: మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.80లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఇంటింట కుళాయిల పనులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఆదివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలో 80 శాతం గ్రామాల్లో ఇంటింట కుళాయిల పనులు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, ఎంపీటీసీ సతివాడ సూర్యకాంతం, ఇజ్జిరోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్...


చేపడుతున్న వ్యర్థాల తొలగింపు పనులు

కొత్తవలస: కొత్తవలస – విజయనగరం రోడ్డులో చింతలదిమ్మ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా డంప్ చేసిన వ్యర్థాల తొలిగింపు ప్రక్రియను అధికారులు ఆదివారం చేపట్టారు. సమీప గ్రామాల నుంచి చెత్తను తీసుకువచ్చి రోడ్డు పక్కన కిలోమీటర్ మేర డంప్ చేశారు. ఈ సమస్యపై 'రోడ్డుపై ప్రమాదకరంగా వ్యర్థాలు' శీర్షికతో సాక్షి పత్రికలో శనివారం వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్థానిక పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి జేసీబీతో వ్యర్థాలను ట్రాక్టర్లకు లోడింగ్ చేయించి దూరంగా తరలించారు. వ్యర్థాలు తొలగించడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


ఎల్.కోట మండలం ఖాసాపేటలో పెసర పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

- ఆశాజనకంగా అపరాల సాగు


గొల్జాంలో సాగులో ఉన్న పెసర పంట

కొత్తవలస: అపరాల పంటలను ఆశించే చీడపీడలను సకాలంలో గుర్తించి, సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కొత్తవలస సబ్‌డివిజనల్ వ్యవసాయ అధికారి ఎల్.విజయ చెబుతున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో రబీ అపరాల సాగు ప్రస్తుతానికి ఆశాజనకంగానే ఉందని, అక్కడక్కడా పైరును కొన్ని రకాల చీడపీడలు ఆశిస్తున్నాయని, వ్యవసాయ సహాయకుల సలహా మేరకు వాటి నివారణ చర్యలను చేపట్టాలని రైతులకు సూచించారు.15 రోజులుగా కురుస్తున్న మంచు వల్ల త్రిప్ అనే పురుగు పంటను ఆశించి పూతను తినేస్తోందని, నివారణకు లీటర్ నీటిలో 2 మిల్లీలీటర్ల పిప్రోనిల్ మందును కలిపి పిచికారీ చేయాలని, ఎకరాకు 400 మిల్లీలీటర్ల మందు సరిపోతుందని తెలిపారు. కాస్త ముందుగా వేసిన పంటలో కాయతొలుచు పురుగు అధికంగా ఉండే అవకాశం ఉందని, నివారణకు క్లోరిపైరిపాస్ మందును లీటర్ నీటిలో 2.5 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలని, ఎకరానికి అరలీటర్ మందు అవసరమని వివరించారు.

6,094 హెక్టార్లలో పెసర, మినప పంటలు

ఎస్.కోట నియోజకవర్గంలో 3,032 హెక్టార్లలో రైతులు అపరాలు సాగు చేస్తున్నారు. లక్కవరపుకోట మండలంలో 720 హెక్టార్లలో పెసర పంట, 880 హెక్టార్లలో మినప సాగులో ఉంది. శృంగవరపుకోటలో 691 హెక్టార్లలో పెసర, 722 హెక్టార్లలో మినప, వేపాడలో 648 హెక్టార్ల లో పెసర, 722 హెక్టార్లలో మినప, కొత్తవలసలో 42 హెక్టార్లలో పెసర, 286 హెక్టార్లలో మినప, జామి మండలంలో 943 హెక్టార్లలో పెసర, 1,286 హెక్టార్లలో మినప పంట సాగులో ఉందని ఏడీఏ తెలిపారు. క్షేత్ర స్థాయిలో పంటను ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు, సిబ్బంది పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ లోవరాజు

శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని ఎస్.కోట ఎస్‌ఐ లోవరాజు సూచించారు. స్థానిక ఆర్టీటీసీ కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ కె.రమేష్ అధ్యక్షతన రహదారి భద్రతా వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ రహదారి భద్రతా నిబంధనలు పాటించటం వల్ల ప్రమాదాలను నియంత్రివచ్చని అన్నారు. అనంతరం డిపోలోని ఉత్తమ మెకానిక్‌లు నరసయ్య, మహామూద్‌ను సత్కరించారు.కార్యక్రమంలో డ్రైవర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు భూసర్వేపై గ్రామసభలు

చీపురుపల్లిరూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర భూరీసర్వేపై మండలంలోని మెట్టపల్లి, పి.ఎస్.లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం రైతులతో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ గ్రామసభలకు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష హాజరవుతారని పేర్కొన్నారు. భూసర్వేకు సంబంధించిన విధి విధానాలను, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

వ్యాకులమాత క్షేత్రంలో దివ్యబలి పూజ


ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న ఫాదర్ విజయ్ భాస్కర్

కొత్తవలస రూరల్: కొండడాబా గ్రామంలోని వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో నవీన ప్రార్థనలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవదిన పూజల్లో భాగంగా మూడో రోజు ఆదివారం పరిశుద్ధ దివ్యబలి పూజను ఫాదర్ ఎస్.విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫాదర్ విజయ్‌భాస్కర్, పాధర్ ఎస్.పీటర్ క్రీస్తు సందేశం వినిపించారు. ప్రార్థనల్లో సాలిగ్రామపురం, వెంకొజీపాలెం, స్టీల్ ప్లాంట్ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

దళితులకు రాజ్యాధికారమే లక్ష్యం

- మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్


విశ్వనాథ్‌ను అభినందిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: దళిత బహుజనలకు రాజ్యాధికారం అందించడమే మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకె విశ్వనాథ్‌ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అణగారిన ప్రజల విముక్తి కోసం ఎంఎస్‌పీ పని చేస్తోందన్నారు. పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రంలో అధిపత్య కులాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన ఏకైక పార్టీ తమదేనని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో దళిత, బహుజన, ముస్లిం మైనార్టీ ప్రజలందరిని కలుపుకొని ప్రధాన సమస్యలపై పోరాడతామన్నారు. అనంతరం విశ్వనాథ్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీనుమాదిగ, అప్పారావు మాదిగ, శంకరరావు మాదిగ, ఈశ్వరావు మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకి ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి


వేపాడలో చిన్నారుల కోలాటం

- ఆకట్టుకున్న గుర్రాలు, ఎడ్ల పరుగు ప్రదర్శన
- సంగిడీ రాళ్ల పోటీల్లో సత్తాచాటిన వస్తాదులు


జాకేరులో గుర్రాల పరుగు ప్రదర్శన


సంగిడీ రాళ్ల పోటీలు

వేపాడ: సంక్రాంతి పండగ నుంచి మండలంలో ప్రారంభమైన తీర్థమహోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో ప్రతీ ఏడాది తీర్థ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాకేరు గ్రామంలో పైడమ్మ, చిన్నమ్మ పేరంటాలు, వీరాంజనేయస్వామి, వేపాడలో పరదేశమ్మ,ముత్యాలమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల పెద్దలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

గుర్రాల పరుగుప్రదర్శన

జాకేరులో నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 11 గుర్రాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. . విజేతలకు డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీటీసీ టి.వి.రమణ గ్రామపెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. రామన్న పాలెంకు చెందిన విక్రమ్ గుర్రం ప్రథమస్థానంలో నిలిచి రూ.12 వేలు, సింగపూర్ సత్యనారాయణ సాయివిరాట్ గుర్రం ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10 వేలు, రామన్నపాలెంకు చెందిన ఠాగూర్ గుర్రం తృతీయ స్థానంలో నిలిచి రూ.8 వేల నగదు బహుమతులు గెలుచుకున్నాయి. అలాగే నాలుగు, అయిదు, ఆరోస్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

సంగిడీ రాళ్ల పోటీలు

వేపాడ, జాకేరు గ్రామాల్లో నిర్వహించిన సంగిడి రాళ్ల పోటీల్లో విజయనగరం, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన వస్తాదులు పాల్గొన్నారు. జాకేరులో నిర్వహించిన పోటీల్లో తీత విభాగంలో గొల్లు రవికుమార్ లక్కిడాం ప్రథమ స్థానంలో, పి.వెంకటేష్ ద్వితీయ స్థానంలో నిలిచారు. పోటు విభాగంలో పి.వెంకటేష్ ప్రథమ, ఇ.రవికుమార్ ద్వితీయ, ఇసురు విభాగంలో గొల్లి రవికుమార్ ప్రథమ, పి.వెంకటేష్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

ఎడ్ల పరుగు పోటీలు

వేపాడలో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వీటిలో వావిలపాడుకు చెందిన గండి వెంకటరావు ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.15 వేలు, వల్లంపూడి సిద్ధివినాయక ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.12వేలు, బోనంగికి చెందిన మోదకొండమ్మ ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచిన ఎద్దులకూ నగదు బహుమతులు అందించారు.


వేపాడలో పరుగు ప్రదర్శనలో దౌడు తీస్తున్న ఎద్దులు


ఎడ్ల పరుగు పోటీల్లో విజేతలకు నగదు మహుమతులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చిన రాముసాయుడు